సాక్షి
అనకాపల్లి
సోమవారం । 22 । జూలై । 2024



రాకపోకల పునరుద్ధరణకు చర్యలు

విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన డైవర్షన్ రోడ్డుపై రాకపోకలకు అధికారులు చర్యలు చేపట్టారు. 8లో



140 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

ఏపీఈపీడీసీఎల్ పరిధి 5 సర్కిళ్లలోని 140 గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడిందని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. 8లో



నావికాదళ ఉద్యోగుల సైకిల్ యాత్ర

తగరపువలస: తూర్పుతీర నావికాదళ కేంద్రం ఐఎన్ఎస్ శాతవాహన గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా శాతవాహన కేంద్రం నుంచి రుషికొండ వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు నలుగురి ఎంపిక



రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తుమ్మపాల: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-11 బాలుర చదరంగం విభాగంలో విన్నర్‌గా పరవాడకు చెందిన మేడ లిఖిత్, రన్నర్‌గా అనకాపల్లి పట్టణానికి చెందిన శివ ధీరజ్, బాలికల విభాగంలో విన్నర్‌గా ఎస్.రాయవరానికి చెందిన సహస్ర, రన్నర్‌గా అనకాపల్లి పట్టణానికి చెందిన గీతిక విజయం సాధించారు. దీంతో ఈ నెల 27, 28 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 11 పోటీలకు వీరు ఎంపికైనట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వేంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సాయి శక్తి టెక్నో స్కూల్‌లో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. విజేతలకు స్కూల్ కరెస్పాండెంట్ అన్నం రాజశేఖర్, శ్రీదివ్య, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వూడ రాము, జాయింట్ సెక్రటరీ గురుమూర్తి, సీనియర్ చెస్ కోచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

బాయ్ సమావేశానికి ఏపీ కార్యవర్గ సభ్యులు



ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మతో బ్యాడ్మింటన్ కార్యవర్గ సభ్యులు

ఉక్కునగరం: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బాయ్) జాతీయ కార్యవర్గ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. గౌహతిలో జరిగిన ఈ సమావేశానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు హిమంత బిస్వా శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాల గురించి చర్చించినట్లు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది వార్షిక బడ్జెట్‌ను ఆమోదించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్, రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకమ చౌదరి తదితరులు హాజరైనట్లు తెలిపారు.

అన్నదాతకు ఏదీ బీమా?

గత ప్రభుత్వ హయాంలో అమలైన పంటల బీమా స్థానంలో రైతులకు మరింత ప్రయోజనం కలిగించేలా మెరుగైన పథకాన్ని తెస్తామని టీడీపీ కూటమి ప్రకటించినా ఇంత వరకూ ఏ నిర్ణయం తీసుకోపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త పథకంపై అధ్యయనానికి ముగ్గురు మంత్రులతో కమిటీ వేయడంతోపాటు నెల రోజుల్లో సదరు కమిటీ నివేదిక ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానించడంతో రైతుల్లో పలు సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది. కమిటీ నెల రోజుల్లో నివేదిక వచ్చినా, ఉత్తర్వులొచ్చి కార్యాచరణలోకి రావాలంటే మరింత సమయం పడుతుంది. ఉచిత పంటల బీమా అమలు చేస్తుందా... మళ్లీ 2019కు ముందు పరిస్థితులే వస్తాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- పంటల బీమాపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- ఉచిత బీమా అమలయ్యేనా?
- ఎదురు చూస్తున్న రైతన్నలు



సాక్షి, అనకాపల్లి: వ్యవసాయం దండగ అనే పరిస్థితి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ముందు ఉండేది. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల కారణంగా వేసిన పంట నాశనమై రైతు నష్టపోయేవాడు. చేసిన అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్యలకు కూడా పాల్పడిన సందర్భాలను 2019 ముందు వరకూ చూశాం. ఇలాంటి విపత్తుల నుంచి అన్నదాతలను ఆదుకునేందుకు, వారికి అండగా ఉండేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం తీసుకొచ్చింది. ప్రతి ఏడాది పంట వేసినప్పుడే ఈ-క్రాప్ బుకింగ్ చేసి ఏ రైతు నష్టపోకుండా వైఎస్ జగన్ సర్కార్ అండగా నిలిచింది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి 45 రోజులు దాటింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. నాట్లు వేసేందుకు రైతు సిద్ధమయ్యాడు. పంట రుణాల రెన్యువల్ ప్రక్రియ కూడా ముగిసింది. సకాలంలో బీమా ప్రీమియం చెల్లించక పోతే ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులు పరిహారం పొందే అవకాశం కోల్పోతారు. అయితే సాధారణంగా రెన్యువల్ సమయంలోనే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. కానీ రెన్యువల్స్ ముగిసిన తర్వాత కూడా పంటల బీమాపై మంత్రులతో త్రిసభ్య కమిటీ వేసి రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. 2024-25 సంవత్సరానికి సంబంధించిన విధివిధానాలను కూటమి ప్రభుత్వం ఖరారు చేయాల్సి ఉంది.

రైతులపై భారం పడకూడదని..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రైతులపై ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా అమలు చేసింది. అదేవిధంగా కూటమి ప్రభుత్వం కూడా ఉచితంగా పథకం అమలు చేస్తుందా ..? లేదంటే 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు హయాంలోఎకరాకు రూ.525 చొప్పున ఐదేళ్లలో రూ.223.2 కోట్ల ప్రీమియం వసూలు చేశారు. అదే మాదిరిగా ఇప్పుడు కూడా ప్రీమియం భారం పడనుందా అని రైతులు ఆందోళనలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వరితో పాటు బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాటాకు వాతావరణ బీమా, ఫసల్ బీమా కింద కంది, వరి, మొక్కజొన్న, ఉచిత బీమా కింద ఆముదం, రాగి పంటలకు వర్తింపజేశారు. కూటమి ప్రభుత్వం ఏయే పంటలకు బీమా వర్తింపజేస్తుందో ప్రకటించాల్సి ఉంది.

జిల్లాలో వివరాలు ఇలా..

గత ఏడాది జిల్లాలోని 24 మండలాల్లో 1.8 లక్షల ఎకరాల్లో ఖరీఫ్‌లో సాగు చేశారు. వీటిలో 1.2 లక్షల్లో వరి వేశారు. దాదాపుగా 2,50,888 మంది రైతులు ఈ క్రాప్ ఉచిత బీమా కోసం ఎదురు చూస్తున్నారు.

పంటల బీమాపై స్పష్టత ఇవ్వాలి



వ్యవసాయ భూమిపై బ్యాంకుల్లో తీసుకున్న రుణానికి ఇటీవల వడ్డీ కట్టి రెన్యువల్ చేయించాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాకున్న నాలుగెకరాల భూమికి ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించింది. 2014లో టీడీపీ పాలనలో ఎకరాకు రూ.525 చొప్పున ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించేవాడిని. ఈ ఏడాది కూడా పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తే బాగుంటుంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

– బంటు పరదేశినాయుడు, కొండపాలెం గ్రామం

ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాలేదు..



పంటల బీమాపై ప్రభుత్వం నుంచి ఎటువంటి గైడ్‌లైన్స్ రాలేదు. త్వరలో విధివిధానాలు ఖరారవుతాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

నేటి నుంచి 'శిక్షా సప్తాహ్'



యలమంచిలి కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల

- ప్రభుత్వ పాఠశాలల్లో 22 నుంచి 28 వరకు ప్రత్యేక వారోత్సవాలు
- జాతీయ విద్యావిధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తి

యలమంచిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)-2020 ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో వారోత్సవాల నిర్వహణకు విద్యాశాఖ సమాయత్తమైంది. నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చిన తర్వాత జరుగుతున్న నాలుగో వార్షికోత్సవం సందర్భంగా 'శిక్షా సప్తాహ్' పేరుతో పాఠశాలల్లో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఈ షెడ్యూల్‌ను మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించాల్సిందిగా మండల విద్యాశాఖాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ ఆదేశాలు జారీ చేశారు.

2020 నుంచి ఎన్ఈపీ

దేశంలో కొత్త విద్యా విధానం 2020 జులై 29వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు అప్పటి వరకూ ఉన్న 10+2+3 విద్యా విధానాన్ని రద్దు చేశారు. ఎన్ఈపీ- 2020 ప్రకారం 5+3+3+4 విధానానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త విద్యావిధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఈ 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను భాగస్వాములను చేయాలని సమగ్ర శిక్ష అధికారులు మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

వారం రోజుల కార్యక్రమాలు ఇలా..

'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలతో వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 1,124 ప్రాథమిక, 324 ప్రాథమికోన్నత, 428 ఉన్నత పాఠశాలల్లో సోమవారం నుంచి ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

22న స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన

స్థానికంగా లభించే వనరులను ఆసరాగా చేసుకుని అభ్యసన సామగ్రిని తయారు చేయడం, తయారు చేసిన సామగ్రిని పరిశీలించడానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలను ఆహ్వానిస్తారు.

23న పునాది అభ్యసన

1వ తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి చర్చల ద్వారా అవగాహన కల్పిస్తారు.

24న క్రీడా దినోత్సవం

వివిధ క్రీడలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించడం పోటీల ద్వారా వారిలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడం, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను వివరించడం.

25న సాంస్కృతిక దినోత్సవం

భిన్నత్వంలో ఏకత్వ భావనను విద్యార్థుల్లో పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం. ప్రధానంగా క్లాసికల్, ఫ్యాన్సీ డ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

విద్యలో సాంకేతికాభివృద్ధిని గుర్తించేలా చర్చలు జరపడం, ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తరగతి గదుల సౌకర్యాలు మెరుగుపర్చుకుని డిజిటల్ విద్య కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాలను గుర్తించడం.

27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాల(మిషన్ లైఫ్ యాక్టివిటీస్) కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వహణ, కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై అవగాహన. స్కూల్లో కనీసం 35 మొక్కలు నాటించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం

విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయుల సంఘాల సహకారాన్ని పెంపొందించడం కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడం, పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో భోజనాలు, సహపంక్తి భోజనాలు నిర్వహిస్తారు.

అందరూ భాగస్వాములు కావాలి



వారం రోజుల పాటు నిర్వహించే శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో పాఠశాలలు ఉన్న గ్రామాల్లో స్థానికులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు భాగస్వాములయ్యేలా ప్రధానోపాధ్యాయులు చూడాలి. సమగ్ర శిక్ష మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి. కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా ఎంఈవోలు పర్యవేక్షించాలి. ఆయా పాఠశాలల్లో ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలతో డాక్యుమెంటేషన్ నమోదు చేయాలి.

– ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి

ఘనంగా గురు పౌర్ణమి

- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కె.కోటపాడు: గురుపూర్ణిమ ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి. షిర్డీ సాయి బాబా, దత్తాత్రేయ, ఇతర ఆలయాలలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కె.కోటపాడులో షిర్డీసాయి ఆలయంలో కమిటీ సభ్యులు లక్ష ఎండు ద్రాక్షలతో ప్రత్యేక అర్చన చేశారు. ఆలయ అర్చకులు గోరుగుంతు రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ఎండు ద్రాక్షలతో పూజలందుకున్న షిర్డీసాయిబాబా



యలమంచిలి బస్ కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక అలంకరణలో బాబా

జాతీయ స్థాయి స్పోర్ట్స్ వర్క్‌షాప్‌కు కోచ్ అబ్బు ఎంపిక



నర్సీపట్నం: పంజాబ్ రాష్ట్రం పాటియాలాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరగనున్న స్పోర్ట్స్ సైకాలజీ, న్యూట్రిషన్, స్ట్రెంత్ కండిషన్ వర్క్‌షాప్‌కు నర్సీపట్నానికి చెందిన కోచ్ అబ్బు ఎంపికయ్యారు. ఈనెల 22నుంచి ఆరు రోజుల పాటు ఈ వర్క్‌షాపు జరుగుతుంది. ఈ వర్క్‌షాపులో ఒలింపిక్ స్థాయి కోచ్‌లు పాల్గొంటారని అబ్బు తెలిపారు. ఆటలో మానసికంగా ఎలా ఉండాలి, శరీరధారుడ్యం, ఏవిధమైన శిక్షణ అవసరమనేదానిపై శిక్షణ ఇస్తారని తెలిపారు.

నమో నారసింహా...



గిరి ప్రదక్షిణ చేసి తొలిపావంచా వద్దకు వెళ్తున్న భక్తులతో కిక్కిరిసిన అడవివరం ప్రధాన రహదారి



వర్షంలో తడుస్తూ గిరి ప్రదక్షిణకు..



క్యూ లైన్‌లో భక్తులు

- ముగిసిన గిరి ప్రదక్షిణ
- జనసంద్రంగా మారిన సింహగిరి
- భక్తులతో కిటకిటలాడిన పాతగోశాల
- విశేషంగా ఆలయ ప్రదక్షిణలు
- 9 లక్షల మంది గిరి ప్రదక్షిణ చేశారని అంచనా
- 60 వేల మందికి దర్శనం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామిని స్మరిస్తూ శనివారం లక్షలాదిమంది భక్తులు చేపట్టిన సింహగిరి ప్రదక్షిణ ఆదివారంతో ముగిసింది. సింహాచలంలోని తొలిపావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల ప్రదక్షిణ చేసి తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. స్వామి సన్నిధిలో మళ్లీ కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ ముగించారు. పలువురు భక్తులు స్వామి దర్శనానికి మెట్లమార్గంలో సింహగిరికి తరలివెళ్లారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురుస్తున్నా భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు.

తెల్లవారుజామున 3.30 గంటల నుంచే దర్శనాలు

గిరి ప్రదక్షిణ చేసి వచ్చిన భక్తులకు ఆదివారం తెల్లవారుజామున 3.30గంటల నుంచే స్వామివారి దర్శనాలు కల్పించారు. ముందుగా ఉదయం 5.30 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తామని దేవస్థానం అధికారులు ప్రకటించారు. కానీ భక్తుల సౌకర్యార్థం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే దర్శనాలు అందజేయడం విశేషం. సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేశారు. భక్తులకు త్వరితగతిన దర్శనాలు అందించేందుకు ఉచిత దర్శనం క్యూతో పాటు రూ100, రూ.300 దర్శన టికెట్ల క్యూల్లో కూడా భక్తులను ఉచితంగా పంపించారు. ఆలయ నీలాద్రిగుమ్మం దగ్గర నుంచే లఘు దర్శనం కల్పించారు. అంతరాలయ దర్శనం బంద్ చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపే దాదాపు భక్తుల దర్శనాలు పూర్తయ్యాయి.

విశేషంగా ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై ఆలయ ప్రదక్షిణలు ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున 3గంటల నుంచి భక్తులను ఆలయ ప్రదక్షిణలకు అనుమతించారు. అప్పటికే సింహగిరికి చేరుకున్న భక్తులు ఆలయ బాహ్య ప్రాకారం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

సింహగిరిపై జన జాతర

శనివారం 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతోను, మరో పక్క ఆలం ప్రదక్షిణలకు వచ్చిన భక్తులతోను ఆదివారం సింహగిరి జనజాతరగా మారింది. భక్తులతో కిటకిటలాడింది.

9 లక్షల మంది గిరి ప్రదక్షిణ

శనివారం 32 కిలోమీటర్ల మేర 9 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేసినట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే ఆదివారం 60 వేల మంది స్వామివారి దర్శనానికి వచ్చినట్టు, సుమారు 5వేల మంది ఆలయ ప్రదక్షిణల్లో పాల్గొన్నట్టు అంచనా వేశారు.

- కొండదిగువ పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం వరకు ఉన్న మార్గం భక్తులతో కిక్కిరిసింది. ఒక పక్క గిరి ప్రదక్షిణ పూర్తిచేసి తొలిపావంచాకు చేరుకునే భక్తులతోను, మరోపక్క గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకుని ఇళ్లకు చేరుకునే భక్తులతోను రద్దీ నెలకుంది.
- గిరి ప్రదక్షి ముగించుకుని తిరిగి కొబ్బరికాయలు కొట్టే భక్తులతో తొలిపాంచా కిటకిటలాడింది.
- మెట్లమార్గంలో కేవలం సింహగిరికి వెళ్లే భక్తులనే అనుమతించారు. కొండదిగువకి మెట్లమార్గంలో అనుమతించలేదు.
- కొండదిగువకి భక్తులను చేరవేసేందుకు దేవస్థానం 45 ఉచిత బస్సులను ఏర్పాటు చేసింది.
- 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి సింహగిరికి వచ్చిన భక్తులను ఆలయ ఉత్తర రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి ఆలయంలోకి, దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తులను దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి పంపించారు.
- ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద నాలుగు లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.
- సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయం వద్ద, సింహగిరి బస్టాండ్‌లోను అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు.
- సింహగిరిపైన, కొండదిగువ పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వర్షాలు తగ్గుముఖం



వడ్డాది డైవర్షన్ రోడ్డును ఆనుకుని ప్రవహిస్తున్న వరద నీరు

తుమ్మపాల: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లావ్యాప్తంగా గతకొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారం మధ్యాహ్నం తగ్గుముఖం పట్టాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాండవ, కోనాం, పెద్దేరు జలాశయాల్లో నీటి మట్టం పెరిగింది. జిల్లాలో 3294.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నెల 19 నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 886.6 మిల్లీమీటర్లు, రెండో రోజు 1610.9, మూడో రోజు 253.5, నాల్గవ రోజు ఆదివారం 543.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనకాపల్లి మండలంలో 204.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా ఎస్.రాయవరం 95.2 మిల్లీమీటర్లగా నమోదైంది.

వర్షపాతం వివరాలు..

జిల్లాలో ఆదివారం నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి..అనకాపల్లిలో 204.8 మిల్లీమీటర్లు, బుచ్చెయ్యపేటలో 172.0, కశింకోటలో 171.6, పరవాడలో 166.7, కోటవురట్లలో 165.3, మాకవరపాలెంలో 164.8, అచ్యుతాపురంలో 157.2, సబ్బవరంలో 154.6, నాతవరంలో 146.8,మునగపాకలో 146.5, నర్సీపట్నంలో 144.5, రావికమతంలో 143.0, యలమంచిలిలో 130.5, రోలుగుంటలో 129.2, కె.కోటపాడులో 122.3, రాంబిల్లిలో 120.3, నక్కపల్లిలో 115.8, దేవరాపల్లిలో 114.0, చోడవరంలో 112.6, చీడికాడలో 108.7, పాయకరావుపేటలో 108.4, గొలుగొండలో 103.4, మాడుగులలో 96.2, ఎస్.రాయవరంలో 95.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది.

ఉధృతంగా పెద్దేరు, తాచేరు

బుచ్చెయ్యపేట: మండలంలో ఆదివారం మధ్యాహ్నం వరకు వర్షం కురవగా తరవాత తెరిపిచ్చింది. పెద్దేరు, తాచేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వడ్డాది గ్రామానికి చెందిన బత్తుల వరలక్ష్మి పెంకుటిల్లు కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. కస్పాగ్రోయిన్ వద్ద ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తోంది. తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడంతో రోడ్డు మొత్తం కొట్టుకుపోకుండా అధికార్లు గండికొట్టి నీటిని విడిచిపెట్టారు. వడ్డాదిలో డైవర్షన్ రోడ్డును ఆనుకుని నీరు ప్రవహిస్తుండగా ప్రమాదాలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. పొలాలు నీటి ముంపులో ఉన్నాయి. ఆర్డీవో చిన్నికృష్ణ, కొత్తకోట సీఐ ఎల్ అప్పలనాయుడు, ఎస్ఐ ఈశ్వరరావు, వీఆర్వో సుధాకర్ తదితరులు డైవర్షన్ రోడ్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.



వడ్డాదిలో వర్షాలకు కూలిన ఇల్లు

'తాండవ'కు జలకళ

నర్సీపట్నం: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయర్ జలాశయంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో రిజర్వాయర్ నీటి మట్టం రోజురోజుకు పెరుగుతోంది. నెల రోజుల క్రితం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటిపోయాయి. ఖరీఫ్ సాగుకు సాగునీరు అందదేమోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 380 అడుగులు, పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 4,060 ఎంసీఎఫ్‌టీ. ప్రస్తుతం 366.90 అడుగులకు నీటిమట్టం చేరింది. 2,331 ఎంసీఎఫ్‌టీల నీటి నిల్వలు ఉన్నాయని జలాశయం అధికారులు తెలిపారు. 2,291 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌లోకి వస్తోంది. ఆదివారం ఉదయం రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో ఐదు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతుండడం వల్ల ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా ఉండదని అధికారులు చెబుతున్నారు.



తాండవ జలాశయం

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న బాలుడు అరెస్టు

నర్సీపట్నం : గంజాయి తరలిస్తున్న మైనర్ బాలుడిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ ఎస్ఐ భీమరాజు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చెడు వ్యసనాలకు బానిసలై, డబ్బు రుచి మరిగిన మైనర్‌లు గంజాయి రవాణాకు అలవాటు పడ్డారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ భీమరాజు, సిబ్బందితో నర్సీపట్నం మండలం ధర్మసాగరం జంక్షన్ వద్ద మాటు వేశారు. గంజాయి తరలిస్తున్న మైనర్ బాలుడు పట్టుబడ్డాడు. బాలుడిని అరెస్టు చేసి అతని వద్ద రూ.70 వేలు విలువ చేసే 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కాగా గొలుగొండ మండలానికి చెందిన బాలుడు పదో తరగతి వరకూ చదివి మానేశాడు. ఈ ఘటనలో మైనర్ బాలుడితో ఉన్న ఇద్దరు స్మగ్లర్లు పరారైనట్టు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధం

- రూ 2 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన పూరిల్లు

మాడుగుల : తుడుం వీధిలో ప్రమాదవశాత్తూ గ్యాస్ లీక్ అయి పూరిల్లు దగ్ధమైంది. తూరుబిల్లి సంతోష్ పావని కుటుంబానికి చెందిన పూరిల్లు ఆదివారం సాయంత్రం 3.15 గంటల సమయంలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. అందులో నివసిస్తున్న సంతోష్ పావని ఇతర కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. ఇంట్లో వున్న రెండు డబుల్‌కాట్ మంచాలు, రెండు బీరువాలు, టీవీ, దుస్తులు, ఇతర నిత్యావసర వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రెండు లక్షల రుపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక కేంద్రం దళాధికారి రాజేశ్వరావు ఆధ్వర్యంలో మంటలు అదుపు చేశారు.

'మాదే నిజమైన కబడ్డీ సంఘం'

విశాఖ స్పోర్ట్స్: ఏపీ కబడ్డీ సంఘంగా తమకే గుర్తింపు ఉందని జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వివరించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన్ని కలిశారు. 115/2010 ఏపీ కబడ్డీ సంఘంగా తమకు గుర్తింపు ఉందన్నారు. 2019లో అసోసియేషన్ ఎన్నికలు జరగ్గా.. 13 రోజుల వ్యవధిలోనే మరో వర్గం వ్యవస్థలను మేనేజ్ చేసి కోర్టులను తప్పుదోవ పట్టించిందన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని క్రీడాకారులకు తగిన న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

రాకపోకల పునరుద్ధరణకు చర్యలు

తాచేరు వంతెన డైవర్షన్ రోడ్డును పరిశీలించిన ఆర్డీవో చిన్నికృష్ణ



తాచేరు డైవర్షన్ రోడ్డు రక్షణకు పేర్చిన ఇసుక బస్తాలు



తాచేరు డైవర్షన్ రోడ్డు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

బుచ్చెయ్యపేట: మండలంలోని విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన డైవర్షన్ రోడ్డులో రాకపోకల పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుత వర్షాలకు ఇక్కడ వరద నీరు ప్రవహించడంతో శనివారం రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో పెద్దేరు, తాచేరు

సాక్షి ఎఫెక్ట్..

నదులు ఉధృతితోపాటు ఎంపీ సీఎం రమేష్ ఆదేశించి నెల రోజులు దాటినా డైవర్షన్ రోడ్డుపై గుప్పెడు మట్టి వేయక పోవడంపై ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, అనకాపల్లి ఆర్అండ్‌బీ డీఈ ధనుంజయ్, భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎస్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. జోరు వర్షం కురుస్తున్నా 250 ఇసుక బస్తాలను డైవర్షన్ రోడ్డుకు రక్షణగా ఏర్పాటు చేయించారు. సోమవారానికి తాచేరులో నీటి ఉధృతి తగ్గితే గ్రావెల్, రాయి బుగ్గి వేసి రోలింగ్ చేసి రాకపోకలు సాగేలా చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే డైవర్షన్ రోడ్డు దెబ్బతినడంతో విశాఖపట్నం, పాడేరు, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే మూడు జిల్లాల ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలిగిన విషయం విదితమే.

తరగతుల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశం



బోదిగల్లం పాఠశాలలో తరగతి గదులను పరిశీలిస్తున్న డీఈవో

నక్కపల్లి: మండలంలో శిథిలావస్థకు చేరిన పెద బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. ఆదివారం ఆమె పాఠశాలను సందర్శించారు. ఇక్కడ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది, పాఠశాల శ్లాబులు పెచ్చులు రాలిపడుతున్నాయి. గదుల్లోకి వర్షపు నీరుచేరింది. దీంతో సోమవారం నుంచి తరగతుల నిర్వహణ కష్టమని భావించిన స్థానిక హెచ్ఎం సత్యనారాయణ ఈవిషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల భద్రత, సౌకర్యాల దృష్ట్యా తరగతులను పక్కనే ఉన్న ఎలిమెంటరీ పాఠశాలల్లోకి మార్చాలని సూచించారు. అక్కడ రెండు గదులను తీసుకుని హైస్కూలు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఇక్కడ నూతన భవనాల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజినీర్లు జె.వి. ప్రసాద్,సత్యస్వరూప్‌లను ఆదేశించారు. పాఠశాల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని డీఈవో తెలిపారు.డీఈవో వెంట యలమంచిలి డీవైఈవో అప్పారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో కుంచం నరేష్, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్. ఆచార్యులు,పేరెంట్స్‌కమిటీ నాయకులు మహబూబ్నీసా, లక్ష్మణరావు,కార్యదర్శి జయప్రకాష్ ఉన్నారు.

జిల్లా అధ్యక్షురాలిగా ఈశ్వరమ్మ



మాట్లాడుతున్న జిల్లా నూతన అధ్యక్షురాలు ఈశ్వరమ్మ

మాడుగుల రూరల్: ఏపీ గిరిజన వైద్య, ఆరోగ్య మహిళా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా జి. ఈశ్వరమ్మ ఎంపికయ్యారు. మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఆదివారం రాష్ట్ర కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి. భూలోకమ్మ మాట్లాడుతూ తాము ఇతర ఉద్యోగ సంఘాలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులతో సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర యూనియన్ ఆదేశాలు అనుసరించి కార్యకలాపాలు కొనసాగిస్తామని జిల్లా అధ్యక్షురాలు అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు కె. సంజీవమ్మ, విశాఖ జిల్లా అధ్యక్షురాలు పి. హేమమాలిని, జిల్లా గౌరవాధ్యక్షురాలు సిహెచ్ చంద్రమ్మ, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షురాలు పి. పద్మ, జిల్లా అసోసియేట్ సభ్యురాలు జి. సుజాత పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి గాయపడ్డ వ్యక్తి మృతి

కె.కోటపాడు : బైక్‌ను నడుపుతూ అదుపుతప్పి పడిపోయి గాయాలపాలైన దాలివలస గ్రామానికి చెందిన దమ్ము నర్సింహమూర్తి(40) చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఎ.కోడూరు ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలి. మృతుడు నర్సింహమూర్తి శనివారం గ్రామంలో గల తన కల్లం నుంచి టీవీఎస్ ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. గ్రామం సమీపంలోనికి చేరుకునే సమయంలో వాహనం అదుపుతప్పి పడిపోయింది. దీంతో నర్సింహమూర్తి తలకు గాయం కావడంతో ఆయనను అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఆయనను శనివారం రాత్రి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సింహమూర్తి ఆరోగ్యం మరింత విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మృతుడు భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు.

సెంట్రల్ జైల్లో నేటి నుంచి జాతీయ స్థాయి సమావేశాలు

ఆరిలోవ(విశాఖ): విశాఖ కేంద్ర కారాగారంలో మూడు రోజులు పాటు జాతీయ స్థాయి సమావేశాలు జరగనున్నట్లు కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కొత్తగా రూపొందించిన చట్టాల గురించి సోమవారం నుంచి 24 వరకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు పాల్గొని కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు.

వర్షాల కారణంగా 140 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

- త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థని సరి చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : వర్షాలు, వరదల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాల్లో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని వివరించారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 140 గ్రామాల్లో 47,999 సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడటంతో పాటు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయనీ, విద్యుత్ తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, వీటన్నింటినీ సరి చేస్తున్నట్లు వివరించారు. వర్షం తగ్గిన ప్రాంతాల్లో మిగిలిన వాటిని సోమవారం నాటికి ప్రత్యేక బృందాలతో పూర్తి స్థాయిలో పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఈలకు ఆదేశాలిచ్చామని సీఎండీ వివరించారు. ఏ సమస్య తలెత్తినా వినియోగదారులు కార్పొరేట్ ఆఫీసు 9440816373, విశాఖపట్నం 7382299975 సెల్ నంబర్‌కు తెలియజేయాలని వినియోగదారులకు సీఎండీ విజ్ఞప్తి చేశారు.

ఎక్కడి వారు అక్కడే..

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ముందు జిల్లాలో తహసీల్దార్లు ఎక్కడ పనిచేశారో.. తిరిగి అక్కడే వారికి పోస్టింగులు దక్కనున్నాయి. ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఉన్న కారణంగా తహసీల్దార్లు యథావిధి స్థానాలకు రానున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మొత్తం 19 మందిని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు పంపారు. అక్కడ నుంచి 19 మంది తహసీల్దార్లు విశాఖలో విధుల్లో చేరారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతోపాటు నూతన ప్రభుత్వం కొలువు తీరింది. ఇప్పుడు తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వర్షం తగ్గితే సోమవారం సాయంత్రం రిలీవ్ చేసే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

విద్యుత్ తీగ యమపాశమై...



జయశంకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

- పాడిగేదెతో పాటు యువకుడు బలి
- గురుపౌర్ణమి రోజు పంచదార్లలో విషాదం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తదితరులు



విద్యుత్ తీగల్లో చిక్కుకొని విగతజీవులుగా పడి ఉన్న గేదె, మృతుడు జయశంకర్

రాంబిల్లి(యలమంచిలి) : గురుపౌర్ణమి రోజు రాంబిల్లి మండలం పంచదార్లలో విషాదం నెలకొంది. విద్యుత్ తీగ యమపాశమై 24 ఏళ్ల యువకుడితో పాటు పాడిగేదె ప్రాణాలు బలిగొంది. కుటుంబానికి జీవనాధారమైన గేదెకు గడ్డి మేపడానికి వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగొస్తుండగా ఊహించని రీతిలో రోడ్డు పక్క తెగిపడిన విద్యుత్ వైరు రూపంలో మృత్యువు కబళించింది. మరి కాసేపట్లో ఇంటికొస్తాడనుకున్న తనకు ఆసరాగా ఉన్న ఒక్కగానొక్క కుమారుడు గేదెను రక్షించబోయి ప్రాణాలు కోల్పోయి విగతజీవిగా పడి ఉండడాన్ని ఘటన స్థలంలో చూసిన తల్లి సత్య గుండెలు బాదుకుంటూ విలపించడం చూపరులను కలచివేసింది. పండగ పూట విషాదం నింపిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలివి.

పంచదార్ల గ్రామానికి చెందిన మరుపురెడ్డి జయశంకర్ ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో ఉన్న మండపం పొలం ప్రహరీ పక్కన గేదెను మేపుతుండగా ఆకస్మికంగా విద్యుత్ తీగ తెగి పాడిగేదె మీద పడింది. దీంతో వెంటనే గేదెను రక్షించబోయిన జయశంకర్‌కు విద్యుత్ షాక్ తగిలి ఘటనా స్థలంలోనే పాడి గేదె, జయశంకర్ కోల్పోయారు. విషయం తెలుసుకున్న రాంబిల్లి సీఐ నర్సింగరావు, విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ తీగలను తొలగించి జయశంకర్ మృతదేహాన్ని, పాడిగేదెను పొక్లెయిన్ సహాయంతో బయటకు తీశారు. మృతుడు జయశంకర్ తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించగా, పెళ్లయిన సోదరి, తల్లి సత్య ఉన్నారు. జయశంకర్ ప్రైవేట్ కంపెనీలో కాంట్రాక్టర్ వద్ద ఉపాధి పొందుతున్నాడు. కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు ఇలా ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి సత్య,సోదరి గుండెలు విలసేలా రోదిస్తుండడం చూపరులను కలచివేసింది. ఈ సంఘటన యలమంచిలి గాజువాక బైపాస్ రోడ్డులో పక్కనే జరగడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి చూసి చలించిపోయారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు రాంబిల్లి పోలీసులు తెలిపారు.

ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సుందరపు

పంచదార్ల గ్రామంలో ఆదివారం విద్యుత్ ప్రమాదం జరిగిన సంఘటనా స్థలాన్ని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సందర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావాల్సిన సహాయంపై అధికారులకు సూచనలు చేశారు.

పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణమే అందించాలి

ఏపీ రైతు సంఘం నాయకులు నాయిన్‌బాబు, వెంకన్న డిమాండ్



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు నాయిన్‌బాబు, వెంకన్న

దేవరాపల్లి: రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రూ. 20 వేలను తక్షణమే అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయిన్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బి.టి. దొర అధ్యక్షతన ఆదివారం దేవరాపల్లి సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయిన్‌బాబు, వెంకన్న మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున సాగు పెట్టుబడులకు రూ. 20 వేలు అందిస్తామన్న హామీ మేరకు రైతులతోపాటు కౌలు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతు కార్డులు మంజూరు చేసి, బ్యాంక్ రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపు చేసి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఉపాధి కూలీలకు ఆరు నుంచి ఎనిమిది వారాల కూలి సొమ్ము అందించకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్షణమే కూలీల బకాయి సొమ్మును మంజూరు చేయాలని కోరారు. ఏడాదికి 200 రోజుల ఉపాధి పని దినాలు, రోజుకు రూ.600 చొప్పును కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ. 2 లక్షల వరకు రైతులకు, కౌలు రైతులకు రుణ మాఫీ చేయాలని, కేరళ తరహాలో రైతులకు రుణ విమోచన చట్టాన్ని చేయాలని కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు జె. దేముడు, శివ, చిన్నంనాయుడు, పి. రాములమ్మ, జర్తా పోతురాజు, రైతులు పాల్గొన్నారు.

కన్కన్కౌ పార్కులపై కన్నేసిన కూటమి?

- లెండివనం, చావిడి పార్కులు, 300 చ.గ. ఖాళీ స్థలం కబ్జాకు యత్నాలు
- గతంలో అడ్డుకున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్
- కొత్త ప్రభుత్వంలో పావులు కదుపుతున్న టీడీపీ నేత



లెండివనం పార్కు



చావడి పార్కు

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం రావణకాండగా మారింది. వైఎస్సార్ సీపీ నేతలనే లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిని చూసి తట్టుకోలేని నాయకులు.. వాటి ఆనవాళ్లు లేకుండా విధ్వంసకాండకు పాల్పడుతున్నారు. మట్టిని, ఇసుకను యథేచ్ఛగా దోచుకుంటున్న కూటమి నాయకులు.. ప్రజా అవసరాలు, వినోదం కోసం కేటాయించిన స్థలాలపై కూడా కన్నేశారు. ఎక్కడ ఖాళీ స్థలాలున్నాయో.. వెతికి కబ్జా చేసేందుకు సిద్ధమవుతున్నారు. తూర్పు నియోజకవర్గంలో పలు చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

జీవీఎంసీ 20వ వార్డులోని ఈస్ట్ పాయింట్ కాలనీ కేడీపీఎం ఉన్నత పాఠశాల రోడ్డులో లెండివనం, చావడి పేర్లతో రెండు పార్కులు పక్కపక్కనే ఉన్నాయి. స్థానికులు ఈ పార్కుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో సేదదీరుతున్నారు. పిల్లలు ఇక్కడ ఆటలాడుకుంటూ సరదాగా గడుపుతున్నారు. ఈ పార్కు, వీటికి చెందిన ఖాళీగా ఉన్న సుమారు 300 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించుకోవడానికి టీడీపీ స్థానిక నేత మళ్లీ సిద్ధమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అదే పార్టీకి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ తన ఇంటిని ఆనుకుని ఈ పార్కులకు చెందిన ఖాళీగా ఉన్న సుమారు 300 చదరపు గజాల స్థలాన్ని కబ్జా చేశాడు. అప్పట్లో స్థానికులు అడ్డుకున్నప్పటికీ అతను తన పని తాను చేసుకుపోయాడు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం, జీవీఎంసీ ఎన్నికల్లో ఈ వార్డు కార్పొరేటర్‌గా వైఎస్సార్ సీపీ నుంచి ముvvల లక్ష్మి ఎన్నికయ్యారు. దీంతో ఇక్కడ కబ్జాకు అడ్డుకట్టపడింది. కార్పొరేటర్, స్థానికులు కబ్జాకు గురైన రెండు పార్కుల స్థలాలను స్వాధీనం చేసుకుని జీవీఎంసీకి అప్పగించారు. అప్పటి నుంచి జీవీఎంసీ ఆధీనంలో ఉన్న ఈ పార్కులను స్థానికులు వినియోగించుకుంటున్నారు. ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రావడంతో టీడీపీ నాయకుడు మళ్లీ ఇక్కడి ఖాళీ స్థలంతో పాటు పార్కులపైనా కన్నేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాటిని ఎలాగైనా కొట్టేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని మండిపడుతున్నారు. జీవీఎంసీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేతలు లెండివనం, చావడి పార్కులు ఆక్రమించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈస్ట్ పాయింట్ కాలనీలోని ఈ పార్కులకు చెందిన సుమారు 300 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని మాజీ రాజ్యసభ సభ్యుడు గరికిపాటి మోహనరావు అల్లుడైన టీడీపీ మాజీ కార్పొరేటర్ నల్లూరి భాస్కరరావు గత టీడీపీ ప్రభుత్వంలో ఆక్రమించి తన ఇంటి స్థలానికి కలిపేశారు. 2021 తర్వాత కార్పొరేటర్‌గా నేను ఆ స్థలాన్ని పరిశీలించి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో సర్వే చేయించాను. ఆ స్థలం జీవీఎంసీ పార్కులకు సంబంధించిన స్థలంగా గుర్తించిన అధికారులు.. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఆ ఖాళీ స్థలంతో పాటు రెండు పార్కులను కూడా కబ్జా చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ రెండు పార్కులను ప్రసాద్ అనే టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్నారు. జీవీఎంసీకి చెందిన ఆయా పార్కుల తాళాలు ఆయన వద్దే ఉంచుకుని నచ్చిన సమయంలో వాటిని తెరుస్తున్నారు. ఈ స్థలాలు కబ్జా కాకుండా జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– ముvvల లక్ష్మీసురేష్, కార్పొరేటర్, 20వ వార్డు

క్లుప్తంగా

శాకంబరిగా కనదుర్గమ్మ



అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారిని ఆషాఢ పౌర్ణమి పురస్కరించుకుని ప్రముఖ వ్యాపారవేత్త కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల సహకారంతో ఆదివారం శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు బాబు పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని శాకంబరీదేవిగా ఉదయగిరి చంద్రశేఖర్ అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ పండగ రేపు

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామం కేఎస్ఆర్ పేటలో పైడితల్లమ్మ పండగను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా లలితా సహస్రనామ పారాయణ



వేంకటేశ్వరస్వామి ఆలయంలో లలితా సహస్ర నామ పారాయణలో మహిళలు

కశింకోట: స్థానిక గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మండల దీక్షగా మహిళలు చేపట్టిన శ్రీలలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి నుంచి ఈ కార్యక్రమం జరుగుతోంది. 41 రోజులపాటు దీక్షగా కార్యక్రమం కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్యాన్సర్ పట్ల అవగాహన తప్పనిసరి

తుమ్మపాల: క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభద్ర సూచించారు. స్థానిక రోటరీ తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ హాల్లో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి(విశాఖ) ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి వచ్చిన 80 మంది స్త్రీ, పురుషులకు వైద్యులు డాక్టర్ సుధానంద, డాక్టర్ సుకన్య పరీక్షలు జరిపి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్(ఉచిత క్యాంప్) చైర్మన్ డాక్టర్ శ్యామ్‌సుందర్, క్లబ్ అధ్యక్షుడు ఎస్.రాజేష్ కుమార్, కార్యదర్శి అనిల్, బుద్ధ రమణాజీ, నూకయ్య శెట్టి, ముప్పన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు .

అనకాపల్లి సినిమాలు

పేకమేడలు	: రాజా
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-2
డార్లింగ్	: షిర్డిసాయి
భారతీయుడు 2	: పర్తిసాయి
క్రైం రీల్	: వెంకటేశ్వర
నరబలి	: శ్రీసత్య
ద బర్త్‌డే బోయ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 95 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, ఓ పాజిటివ్-45 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 196 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 92 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595) ని సంప్రదించవచ్చు.

సేవల్లో మేటి.. కశింకోట పీహెచ్‌సీ

- ర్యాంకింగ్‌లో రాష్ట్రంలో సెకండ్, జిల్లాలో ఫస్ట్
- సుఖ ప్రసవాలకే సిబ్బంది తొలి ప్రాధాన్యం
- 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని స్థానికుల వినతి

కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) రెండు(కశింకోట, అనకాపల్లి) మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో ముందుంది. వైద్య, ఆరోగ్య శాఖ ఇచ్చే ర్యాంకింగ్‌లో రాష్ట్రంలో రెండో స్థానంలోను, జిల్లాలో ప్రథమ స్థానంలో పలుమార్లు నిలిచింది. సుఖప్రసవాలు చేయడంలో ఈ పీహెచ్‌సీ ముందంజలో ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు వెచ్చించి, మరింతగా అభివృద్ధి చేసి, సేవల్ని విస్తృతం చేశారు. ప్రస్తుతం పీహెచ్‌సీ స్థాయిని అప్‌గ్రేడ్ చేసి, ఆ మేరకు అదనపు సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



ఏసీ సదుపాయం కల్పించాల్సిన ప్రసవ గది

కశింకోట: ఆరు దశాబ్దాల క్రితం(1964లో) కశింకోట పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. అప్పట్లో కశింకోట, అనకాపల్లి గ్రామీణం, మునగపాక, పరవాడ మండలాల పరిధిలో వైద్య, ఆరోగ్య సేవలు ఈ పీహెచ్‌సీ ద్వారానే అందేవి. మండల వ్యవస్థ ఏర్పడ్డాక ఆయా ప్రాంతాల్లో పీహెచ్‌సీలు నెలకొల్పడంతో ప్రస్తుతం కశింకోట, అనకాపల్లి మండలాల్లోని కొన్ని ప్రాంతాలకే సేవలు పరిమితమయ్యాయి. ఈ పీహెచ్‌సీ పరిధిలో 14 సచివాలయాలు, 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. రోజూ వంద మందికి పైగానే రోగులు పీహెచ్‌సీకి వచ్చి సేవలు పొందుతున్నారు. నెలకు 10 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో సుఖ ప్రసవాలే ఎక్కువ. దీనికి పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి ప్రధానం. హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి, అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి లేదా విశాఖలోనే కేజీహెచ్‌కు తరలించి, సుఖ ప్రసవాలకు దోహదపడుతున్నారు.



కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జగన్ ప్రభుత్వంలో ఆస్పత్రి అభివృద్ధి

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య, ఆరోగ్య సేవల పట్ల చూపిన శ్రద్ధతో కశింకోట పీహెచ్‌సీకి రూ.60 లక్షలు మంజూరు చేశారు. దీంతో భవనానికి మరమ్మతులు చేపట్టారు. రంగులు వేసి, చుట్టూ రక్షణ గోడ నిర్మించారు. అన్ని రకాల రక్తపరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలు, పుష్కలంగా మందులు అందుబాటులోకి తెచ్చారు. పీహెచ్‌సీలో వైద్య సేవలందించేందుకు ఇద్దరు వైద్యులను నియమించారు. గైనకాలజిస్టుగా లేడీ డాక్టర్ విధులు నిర్వర్తిస్తుండటంతో గర్భిణులు, మహిళలు ఏ చిన్న అనారోగ్యం తలెత్తినా పీహెచ్‌సీ వైద్యుల ద్వారా చికిత్స పొందుతున్నారు. ఇక్కడి సిబ్బంది తమ నిబద్ధతతో అందిస్తున్న సేవల వల్లే రాష్ట్ర స్థాయిలో పీహెచ్‌సీకి ప్రత్యేక గుర్తింపు దక్కింది.



ఏసీ సదుపాయం లేని ఆపరేషన్ థియేటర్

ఆస్పత్రి స్థాయి పెంచాలి

పీహెచ్‌సీలో అందుతున్న మెరుగైన సేవల కారణంగా రోగుల తాకిడి పెరిగింది. దీంతో ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి, అదనపు సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం 10 పడకలు మాత్రమే ఉన్నాయి. ప్రసవాల కోసం ఒకేసారి గర్భిణులు వచ్చినపుడు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినపుడు, డయేరియా, విషజ్వరాలు ప్రబలినపుడు పడకలు సరిపోవట్లేదు.



వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

చాలాసార్లు ఒకే పడక మీద ఇద్దరు రోగుల్ని ఉంచాల్సి వస్తోంది. కొన్నిసార్లు రోగులు నేలపైనే పడుకున్న పరిస్థితులూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీని 20–30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే జరిగితే అనకాపల్లి, విశాఖ వంటి దూరప్రాంతాలకు రోగులు వెళ్లాల్సిన పనిలేకుండానే ఉన్నత వైద్య సేవలు స్థానికంగా అందుబాటులోకి వస్తాయి. ఇందుకు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వీటిని వేగంగా పరిష్కరించాలి

- పీహెచ్‌సీలో ప్రసవ గదికి, ఆపరేషన్ థియేటర్, వార్డులో ఏసీ సదుపాయం లేదు. దీంతో ప్రసవాలు, ఆపరేషన్ నిర్వహించే సమయాల్లో రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- వార్డులో కూడా ఏసీ లేదు. ఎండలు కాస్త ఎక్కువగా ఉన్నా గాలి ఆడక, ఉక్కబోత వల్ల పిల్లలు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు ఇబ్బందులుకు గురవుతున్నారు.
- రక్త పరీక్షలు నిర్వహించే ప్లేట్‌లెట్స్ కౌంట్ యంత్రం లిక్విడ్ ప్రస్తుతం లేదు. దీంతో పరీక్షలు నిర్వహించడం కష్టంగా మారింది. దాన్ని సమకూర్చాల్సి ఉంది.

ఏసీ పెడితే బాగుంటుంది



ప్రసవం కోసం పీహెచ్‌సీలో చేరా. సుఖ ప్రసవం జరిగింది. మగ బిడ్డ. పీహెచ్‌సీ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయి. అయితే ప్రసవ గది, వార్డు క్లోజ్డ్‌గా ఉంది. ఏసీ సదుపాయం ఉంటే బాగుండు. గాలాడక ఇబ్బంది పడుతున్నాం. పసి బిడ్డ అల్లాడిపోయే పరిస్థితి.

– నేమాల శ్యామల, బాలింత, బయ్యవరం

30 పడకల ఆస్పత్రిగా మార్చాలి



కశింకోట పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలి. పీహెచ్‌సీ స్థాయి మేరకు వైద్య సేవలు అందుతున్నాయి. ఉన్నత వైద్యం కోసం అనకాపల్లి, విశాఖ వంటి ప్రాంతాలకు రాత్రి, పగలు అని లేకుండా వెళ్లాల్సి వస్తోంది. పీహెచ్‌సీ స్థాయి పెంచితే ఆ ఇబ్బందులు తీరతాయి.

– ఎస్.విశ్వనాథం, కశింకోట

పీహెచ్‌సీ సేవలు బాగున్నాయి



పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సేవలు చాలా బాగున్నాయి. గర్భిణులకు, బాలింతలు, పిల్లలకు మంచిగా వైద్య సేవలు అందుతున్నాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేందుకు వచ్చాను ఆపరేషన్ అంతా బాగానే చేశారు. అవసరమైన మందులు ఇచ్చారు. ఇబ్బందేం లేదు.


– అనపర్తి పావని, రామాపురం, అనకాపల్లి మండలం.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ఈ పీహెచ్‌సీలో ప్రతి నెలా ప్రసవాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. హైరిస్క్ కేసుల్ని ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అనకాపల్లి, విశాఖకు రిఫర్ చేస్తున్నాం. దీంతో ఎలాంటి రిస్క్ లేకుండా సుఖ ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రజల అభ్యర్థన మేరకు పీహెచ్‌సీలో కల్పించాల్సిన అదనపు సదుపాయాల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈవో, పీహెచ్‌సీ, కశింకోట

నూకాంబికా నమోస్తుతే



అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పిల్లాపాపలతో అమ్మవారిని పూజించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తులు వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

వ్యాస వాఙ్మయమే సనాతన ధర్మానికి మూలం



అర్చకులు రేజేటి గోపా అప్పలాచార్యులను సత్కరిస్తున్న శిష్యులు

తుమ్మపాల: వ్యాస వాఙ్మయమే సనాతన ధర్మానికి మూలమని, వేదంను విభజించి చతుర్వేదములుగా జగతికి అందించిన బ్రహ్మరూపమే వ్యాసమహర్షి అని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు రేజేటి గోపా అప్పలాచార్యులు(చక్రవర్తి) అన్నారు. అంజయ్యకాలనీలో అలివేలు మంగ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురుపౌర్ణమి సందర్భంగా స్థానికులు చక్రవర్తికి గురుపూజ చేసి, గజమాల, పుష్పకిరీటంతో సత్కరించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ గురువు అనే పదానికి ఆద్యుడు వ్యాస మహర్షి అని, అందుకే వ్యాసాయ విష్ణు రూపాయ.. వ్యాస రూపాయ విష్ణవే అన్నారని పేర్కొన్నారు. పురాణ, ఇతిహాసాలతోపాటు గురు బ్రహ్మ, గురు విష్ణు, గురుదేవో మహేశ్వరః అనే దివ్య మంత్రాన్ని జగతికి ప్రబోధించిన దైవ స్వరూపం వ్యాసుడని కీర్తించారు. నా ముందుకు గోవిందుడు, గురువు ఇద్దరూ వస్తే నా తొలి నమస్కారం గురువుకే అందిస్తానని, ఎందుకంటే గురువు వలనే గోవిందుని తెలుసుకున్నానన్న కబీర్ దాస్ మాటలను గుర్తు చేశారు. శిష్యులు లక్ష్మి, శ్రీవాణి, మాలతి, పాపాయి, సత్యవతి, మంగావతి, విజయలక్ష్మి, అప్పలరాజు, దుర్గ, రమణమ్మ, బద్దె భవాని పాల్గొన్నారు.

సకల పాప హరణం.. సాయి దివ్య చరణం

గురు పౌర్ణమి సందర్భంగా ఊరూవాడా సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సాయి దర్శనం చేసుకున్నారు. పలు చోట్ల భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. శివ, వైష్ణవాలయాల్లోను, గ్రామాల్లో ఏకాహం భజన కార్యక్రమాలు జరిపారు.

- ఊరూ వాడా ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు
- షిర్డీ సాయి మందిరాల్లో భారీ అన్న సమారాధనలు



పల్లపు సోమవరంలో సాయిబాబా ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



నెయ్యిలవీధి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు

అనకాపల్లి: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక వేల్పులవీధి, గవరపాలెం, గాంధీనగరం, విజయరామరాజుపేట, లక్ష్మీదేవిపేట, నెయ్యిలవీధి, మండలంలోని కొత్తూరు, తుమ్మపాల, గోపాలపురం, సీతానగరం తదితర ప్రాంతాల్లోని షిర్డీసాయిబాబా ఆలయాల్లో తెల్లవారు జాము నుంచి సాయిబాబాకు క్షీరాభిషేకంతో పాటు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. ఆయా ఆలయాల వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని సాయిబాబాను దర్శించుకున్నారు.

కశింకోట:స్థానిక గవరపేటలో ఆషాఢ పౌర్ణమి పురస్కరించుకొని చేపట్టిన ఏకాహం 24 గంటల భజన కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శనివారం సంప్రదాయంగా ఏర్పాటు చేసిన పూజా కలశాన్ని స్థానిక వీధుల్లో ఊరేగించి ఇక్కడి శారదానదిలో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిపారు.

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోటలోని కోనేరు వద్ద కొలువైన షిర్డీ సాయిబాబా ఆలయంలో పంచామృతాలు, వివిధ పండ్ల రసాలు, విభూతి, చందనాలతో వేద మంత్రాల నడుమ బాబాకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఎ.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్‌వీఎస్ఎన్ రెడ్డి(శ్రీనురెడ్డి), అరుణమ్మ దంపతులు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.రాజారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- కశింకోట గవరపేటలోని సాయిబాబా, దత్తాత్రేయస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- మండలంలోని తేగాడ గ్రామం వద్దనున్న దత్తాత్రేయస్వామి ఆలయంలో గురు పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పూలమాలలతో అలంకరించారు. అర్చకుడు గుల్లపాటి శివకుమార్ ఆధ్వర్యంలో సాయిబాబాకు విశేష పూజలు జరిపారు.
- పల్లపు సోమవరంలోని సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా స్వామిని పూలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల సంఘం కార్యదర్శి జెర్రిపోతుల నూకినాయుడు, నాయకులు నయనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, గొంతిన నాయుడుబాబు, యర్ర జ్యోతికుమార్, బుదిరెడ్డి వీరు తదితరులు పాల్గొన్నారు.
- చింతలపాలెం, కన్నూరుపాలెం సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి పూజలు నిర్వహించారు.

పొలాల్లో నీరు.. రైతుల బేజారు



శంకరంలోని పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



కశింకోట వద్ద శారదానది ప్రవాహం



కశింకోట: పంట భూమిల్లో చేరిన వర్షపు నీరు

తుమ్మపాల: నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణ, మండల పరిసరాల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా మారాయి. ఖరీఫ్ వరి సాగు పొలాల్లో భారీగా నీరు చేరడంతో, నారు మడులకు, ఎదలకు నష్టం వాటిల్లుతుందని రైతులు భయపడుతున్నారు.

- పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్‌లో నీరు చేరడంతో నీటిలోనే బస్సుల రాకపోకలు కొనసాగాయి.
- రైల్వేబ్రిడ్జి, మార్కెట్ యార్డ్, కూరగాయల మార్కెట్, గవరపాలెంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది.
- తుమ్మపాలలోని పలు వీధుల్లో డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోవడంతో రోడ్లపైనే వర్షపు నీరు ప్రవహించింది. దీంతో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది మురుగు తొలగింపు పనుల్లో బిజీ అయ్యారు.
- రాయుడుపేట గ్రామంలో పలు ఇళ్ల వద్ద మోకాలి లోతు నీరు చేరడంతో బయటకు రాలేని పరిస్థితి.
- తుమ్మపాల, శంకరం గ్రామాల పరిధి, బొజ్జన్న కొండ పరిసరాల్లో వరిపొలాలు పూర్తిగా నీటమునిగాయి. దాదాపు 500 ఎకరాల్లో వరినారు మడుల్లో నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.
- శంకరం పొలాల నుంచి ఆవఖండంలోకి ప్రవహించే పులికాలువ పూర్తిగా పూడికతో నిండిపోయింది. దీంతో పొలాల్లో నీరు నిలిచి, వరినారు మడులకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఎదలు కూడా పూర్తిగా నీటి ముంపునకు గురయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆక్షేపిస్తున్నారు.

కశింకోట: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం ఆదివారం కూడా కొనసాగింది. భారీగా దఫదఫాలుగా వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

- కశింకోటలోని మేదరవీధి రోడ్డులో రెండు చోట్ల పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచింది. దీంతో రోడ్డుపై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది చెందారు.
- కనకమహాలక్ష్మి వీధిలో మురికి కాలువల్లో వర్షం నీరు కలిసి రోడ్లపై ప్రవహించింది. ఎంపీడీవో కార్యాలయం ఎదుట నీరు చేరింది. ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణం గోతుల్లో నీరు చేరి చిత్తడిగా మారింది.
- పంట పొలాల్లో నీరు మరింతగా చేరింది. శారదానదిలో నీటి మట్టం బాగా పెరిగి ప్రవహిస్తోంది. శనివారం తక్కువగా ఉన్న నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది.
- గవరపేట ప్రాంతంలో నదిపై తాటి దోనెల ద్వారా రాకపోకలు పరిమితంగా సాగుతుండటంతో రైతులు ఇబ్బంది చెందుతున్నారు. వర్షాలు చెరకు పంటకు ఉపకరిస్తాయని రైతులు చెప్తున్నారు.

యోగా సాధనతో ఆరోగ్యకర జీవితం

తుమ్మపాల: యోగాతో పరిపూర్ణ జీవనం సాధ్యమని, ఆరోగ్యకర జీవితానికి గురువులు నేర్పే విద్యే సరైన మార్గమని భారత్ స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు బీశెట్టి దొరమ్మనాయుడు, కార్యదర్శి మంగయ్య అన్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని జార్జ్ క్లబ్‌లో భారత్ స్వాభిమాన ట్రస్ట్ పతంజలి యోగా వారి ఆధ్వర్యంలో జార్జిక్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగి నాయుడు, సభ్యులు కోలపర్తి కన్నబాబు, బి.శ్రీనివాసరావులు గురువులను సత్కరించి, వారు తమ జీవితాల్ని ఎలా మార్చారో వివరించారు. తమకంటే ఉన్నతంగా స్థిరపడాలనే తపనతో గురువులు నిరంతరం శ్రమిస్తారని కొనియాడారు. యోగా గురువులు మాట్లాడుతూ ప్రకృతి ద్వారా వచ్చే ఫలహారాలను భుజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, ప్రకృతితో మమేకమవ్వాలన్నారు. శ్వాస పై ధ్యాస ఉంచుతూ, ఓంకార నామాన్ని జపిస్తూ, పతంజలి విరచిత యోగాసనాల ద్వారా ఆరోగ్యకరంగా జీవించాలని సూచించారు. ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటూ ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదుగుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరిస్తూ ప్రపంచానికి సనాతన ధర్మాలను పరిచయం చేయడమే యోగా ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొణతాల శివాజీ, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, వంశీధర్, రోహిణి, రవణమ్మ, వివిధ ప్రాంతాల యోగా సాధకులు పాల్గొన్నారు.



గురువులను సత్కరిస్తున్న జార్జిక్లబ్ ప్రతినిధులు

ఘనంగా యానాద్రి అమ్మవారి పండగ

యలమంచిలి రూరల్: యానాద్రి అమ్మవారి పండుగ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అల్లూరి సీతారామరాజు కాలనీలో యానాద్రి అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఇక్కడ పుట్టరూపంలో కొలువుదీరిన అమ్మవారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. చీర, రవిక, గాజులు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఉచిత ప్రసాద వితరణ చేసింది. పండగ సందర్భంగా కోలాటాలు, నేలవేషాలతో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. పండగ సందర్భంగా అల్లూరి సీతారామరాజు కాలనీ ప్రధాన రహదారిని విద్యుద్దీపాలతో అలంకరించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



పుట్టరూపంలో పూజలందుకుంటున్న అమ్మవారు

వైభవంగా వెంకన్న పవిత్రోత్సవాలు

అనకాపల్లి: దేవదాయశాఖ ఆధ్వర్యంలో దేమునిగుమ్మంలో అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు పవిత్రోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం విశేషపూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబుల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, హోమం, బేడసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి జరిగిన మునగపాక అన్నమయ్య స్వరతరంగిణి కోలాట బృందం, మాకవరపాలెం వకుళమాత కోలాట బృందం వారి సంకీర్తనలు, జానపద నృత్యాలు భక్తుల్ని విశేషంగా అలరించాయి. పూజా కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, అర్చకులు ప్రసాద్, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి బేడసేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు